# తాడ్‌బల్ల గ్రామంలో ప్రజా మిలీషియాపై శత్రు హత్యాకాండను ఖండించండి!

దోపిడీ సమాజాన్ని కూల్చి సోషలిజం-కమ్యూనిజం స్థాపనే లక్ష్యంగా పోరాడుతున్న సీపీఐ (మావోయిస్టు)ను సమూలంగా నిర్మూలించాలనే ఉద్దేశ్యంతో ఈ దోపిడీ పాలకవర్గాలు సామ్రాజ్యవాదులతో మిలాఖతై మన పార్టీపై, విప్లవ ప్రజానీకంపై పాశవికమైన దాడిని కొనసాగిస్తున్నాయి. ఈ దాడి రోజు రోజుకు తీవ్రతరమవుతున్నది. ప్రజలు తమ భూమి, భుక్తి, విముక్తి కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడుతూ ప్రాణత్యాగాలు చేస్తున్నారు. జల్-జంగల్-జమీన్‌పై హక్కు మాదేనంటూ, ఈ పోరాటానికి నాయకత్వం వహిస్తున్న సీపీఐ (మావోయిస్టు) సైన్యంలో చేరి, తమ రక్తాన్ని ధారపోస్తూ నెత్తుటి చరిత్రను లిఖిస్తున్నారు.

ఈ మధ్య అంటే 2018 నవంబరు నెలలో జరిగిన ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికల్లో గత 15 సంవత్సరాలుగా అధికారంలో కొనసాగిన బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వం చిత్తుగా ఓడిపోయి, భూపేష్ బఘేల్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అది అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే నిరాయుధంగా ఉన్న మిలీషియాపై క్రూరమృగంలా మీద పడి తన రక్తదాహాన్ని తీర్చుకుంది. దీనికి సంబంధించిన రిపోర్టును ఇక్కడ చూద్దాం :

మావోయిస్టు పార్టీకి కేంద్ర గెరిల్లా బేసుగా ఉన్న మాడ్ డివిజన్‌లోని ఇంద్రావతి ఏరియాలో తాడ్‌బల్ల అనేది ఒక గ్రామం, ఇంద్రావతి నదికి దగ్గరలో ఉంటుంది. జల్-జంగల్-జమీన్‌పై అధికారం కోసం, ఆత్మగౌరవం కోసం, 'మావా నాటే మావా సర్కార్' (మా గ్రామంలో మా ప్రభుత్వం) అంటూ మావోయిస్టు పార్టీ నాయకత్వంలో సమీకృతులవుతున్నారు, పోరాడుతున్నారు. పార్టీ నాయకత్వంలో క్రాంతికారీ జనతన సర్కార్లను ఏర్పాటు చేసుకుని తమ సమస్యలను తామే పరిష్కరించుకుంటున్నారు, పిల్లలకు ప్రాథమిక విద్యను అందిస్తున్నారు, ప్రజల రోగాలకు వైద్యం చేసి బాగు చేస్తున్నారు, అంధవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ శాస్త్రీయ విజ్ఞానాన్ని నేర్చుకుంటున్నారు. శత్రుదాడి నుండి తమ సర్కార్లను కాపాడుకునేందుకు రక్షణ విభాగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీని నాయకత్వంలో ప్రజలు సాయుధమై భూంకాల్ మిలీషియా, గ్రామ రక్షణ దళం, మిలీషియా ప్లాటూన్ వంటి వివిధ ప్రజా మిలీషియా నిర్మాణాలలో సంఘటితమయ్యారు, అవుతూనే ఉన్నారు.

ప్రజా మిలీషియా ఆర్‌పీసీలను శత్రు దాడి నుండి రక్షించేందుకు రోజు వారీగా వివిధ మిలిటరీ విన్యాసాలు చేస్తుంది. అందులో భాగంగానే తాడ్‌బల్ల అనే గ్రామంలో మూడు ఆర్‌పీసీ (పల్లి, కోల్‌నార్, ఊత్‌లా ఆర్‌పీసీలకు)లకు చెందిన మిలీషియా సభ్యులు 70 మంది

సమీకరించబడ్డారు. ఈ సమాచారం శత్రువు తన నెట్‌వర్క్ ద్వారా తెలుసుకుని, పక్కా సమాచారంతో దాడి కోసం 6-2-2019న రాత్రే బలగాలు బీజాపూర్, భైరంగఢ్ క్యాంపుల నుండి ఏడు బ్యాచీలుగా బయలుదేరాయి. ఇంద్రావతి నదిని రాత్రికి రాత్రే పల్లి దగ్గర దాటాయి. ఈ విషయం ప్రజలకు ఎవరికీ తెలియదు. అక్కడి నుండి లోపలికి వచ్చే క్రమంలో మిలీషియా బలగాలు, ప్రజలు పాతిపెట్టిన కొయ్యబొంగల్లో పడి ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. అక్కడి నుండే వారిని తీసుకుని ఒక బ్యాచ్ స్టేషన్‌కు వాపస్ పోయింది. మిగిలిన ఆరు బ్యాచీలు వాంగేల్, ధర్మ, డుంగా గ్రామాలను కవర్ చేస్తూ తాడ్‌బల్ల వాగు పట్టుకొని గుట్ట ఎక్కారు.

ప్రజలు చూసి వెంటనే ప్రజలను అలర్ట్ చేయడం కోసం ఆ పరిసర ప్రాంతాలంతటా టపాకాయలు కాల్చారు. టీసీఓసీ సందర్భంగా మోటివేషన్ కోసం, శిక్షణ కోసం తాడ్‌బల్ల వాగు పైన గుట్ట మీద జమ అయిన మిలీషియా కామ్రేడ్స్ కూడా విన్నారు. అక్కడ వారిని గైడ్ చేయడం కోసం ఆ ఏరియా ఏసీ సభ్యుడు కూడా ఉన్నాడు. ఈ శబ్దం విన్న మిలీషియా కామ్రేడ్స్ ఏసీ కామ్రేడ్‌తో ఈ విషయం చర్చించారు, డేరా మారిస్తే బాగుంటుందని కూడా అన్నారు. కానీ ఆ కామ్రేడ్ పరిస్థితిని నిర్దిష్టంగా అర్థం చేసుకోలేదు. నది అవతల శబ్దాలు వస్తున్నాయి, మనకు ఏమీ కాదు అంటూనే ట్రైనింగ్ ప్రోగ్రామ్ కొనసాగించాడు.

శత్రువుకు మన డేరా ఎక్కడ ఉన్నదనేది ఖచ్చితంగా తెలియదు. కానీ మన కామ్రేడ్స్ లొల్లి విని డేరాను పసిగట్టాడు. దాంతో శత్రువుకు ఐదు నిమిషాల దగ్గరగా సివిల్‌లో వచ్చి రెక్కీ చేసుకునే అవకాశం కూడా కలిగింది. దీంతో మిలీషియా క్యాంపును శత్రు బలగాలు మూడు వైపులా చుట్టుముట్టాయి. నాలుగవ వైపు చుట్టుముట్టాల్సిన శత్రు బలగాలు కొంత ఆలస్యం కావడం వల్ల కొంత దూరంగా ఉండిపోయాయి.

2019 ఫిబ్రవరి 7 తేదీ. ఉదయం 10 గంటలకు మన క్యాంపులో మిలీషియా కామ్రేడ్స్‌కు ట్రైనింగ్ కొనసాగుతున్నది. తమ క్యాంపుకు రక్షణ ఏర్పాట్లలో భాగంగా ఒక సెంట్రీని (భర్మార్లతో కూడిన) పెట్టుకున్నారు. గ్రౌండ్‌లో శిక్షణలో భాగంగా వారు చేయాల్సిన డ్రిల్ గురించి వివరించిన తర్వాత 'టేక్ కవర్' (కవర్లలోకి వెళ్లండి) అంటూ మిలీషియా కమాండర్ కాషన్ ఇచ్చాడు. అప్పటికే మిలీషియా క్యాంపుకు అతిసమీపంలోకి వచ్చిన శత్రు బలగాలు తమను చూసే 'టేక్ కవర్' అనే కాషన్ ఇచ్చారని భావించి ఇక ఎంతమాత్రమూ ఆలస్యం చేయకుండా సర్‌ప్రైజ్‌గా నిరాయుధంగా ఉన్న మిలీషియా కామ్రేడ్స్‌పై అత్యాధునిక ఆయుధాలతో గుండ్ల వర్షం కురిపించాయి, షెల్స్ కూడా వేశాయి. ఆ సమయంలో మిలీషియా బలగాలు తమ భర్మార్లను ఒకే దగ్గర చెట్టుకు ఆనించి పెట్టుకుని ఉండినారు. దీన్ని పసిగట్టిన శత్రువు ఆ భర్మార్లకు గురిపెట్టి కాల్పులు జరపడంతో మిలీషియా కామ్రేడ్స్ వాటిని అందుకునే ప్రయత్నం చేసినప్పటికీ అందుకోవడం సాధ్యపడలేదు. దాంతో మిలీషియా కమాండర్ 'శత్రువు మనల్ని

చుట్టుముట్టాడు-ఎవరి శక్తి కొలదీ వాళ్ళు పరుగెత్తండి' అంటూ మళ్ళీ కాషన్ ఇచ్చాడు. దీంతో మిలీషియా కామ్రేడ్స్ ఎక్కడికక్కడ శత్రు బలగాల మధ్య గండి కొట్టుకుంటూ పరుగెత్తడం ప్రారంభించారు. ఒకవైపు అంటే నాలుగవ వైపు ఫైరింగ్ తక్కువగా ఉండటాన్ని గమనించి ఆ వైపుగా ఎక్కువ మంది కామ్రేడ్స్ రిట్రీట్ అవుతున్న క్రమంలో, శతృవు దీన్ని గమనించి ఆ వైపు షెల్స్ వేశాడు. ఒక షెల్ మిలీషియా కామ్రేడ్స్ రిట్రీట్ అవుతున్న దిశలో ముందు వైపు పడి పేలింది. దాంతో వాళ్లు మళ్ళీ వెనక్కి తిరిగి డేరా వైపుకు వచ్చి మరో దిశలో శత్రు బలగాల మధ్య నుంచే గండి కొట్టుకుని వెళ్ళనారంభించారు. అక్కడ అప్పటికే ఎల్ఎంజీని బిగించుకొని ఉన్న శత్రువు, గండి కొట్టుకొని వెళుతున్న మిలీషియా కామ్రేడ్స్‌పై ఎల్ఎమ్‌జీతో రాపిడ్ ఫైర్ చేయడంతో కొందరు కామ్రేడ్స్ అక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరి కొందరు శతృవు తలలపై నుండి జంప్ చేస్తూ రిట్రీట్ అయ్యారు. ఈ క్రమంలో ఒక కామ్రేడ్ శత్రు రాపిడ్ ఫైర్ నుంచి తప్పుకోవడానికి నేలపై బోర్లా పడుకున్నాడు. ఆ కామ్రేడ్‌పై శతృవు రెండు మ్యాగజైన్స్‌లోని తూటాలు ఖాళీ అయ్యేవరకు ఫైర్ చేసాడు. ఇంత ఫైరింగ్ జరిగినా ఆ కామ్రేడ్ ఎటు కదలకుండా ఉండడం గమనించి చనిపోయాడనే నిర్ధారణకు వచ్చి, 'ఇప్పుడు పారిపోరా!' అంటూ అహంకారంతో హేళనగా అరిచాడు. ఈ స్థితిలో వెంటనే ఆ కామ్రేడ్ ఒక్క ఉదుటన పైకి లేచి జంప్ చేసుకుంటూ క్షేమంగా రిట్రీట్ కావడంతో శత్రువు నివ్వెరపోయాడు. మరో వైపు శతృ రాపిడ్ ఫైరింగ్‌ను గండి కొట్టుకుంటూ వెళుతున్న మహిళా మిలీషియా కామ్రేడ్స్ దట్టమైన చెట్ల పొదల్లో ఎటూ వెళ్లలేక ఇరుక్కుపోయారు. ఆ వైపు నుండి వెళ్లడం సాధ్యపడక అక్కడే ఆగిపోయారు. పోలీసులు ఫైరింగ్ చేస్తూ ఆ చెట్ల పొదలను కూడా క్లియర్ చేస్తూ రావడంతో, అక్కడ దాక్కొని ఉన్న ఐదుగురు మహిళా కామ్రేడ్స్‌ను ప్రాణాలతో పట్టుకున్నారు.

ఫైరింగ్ శబ్దాలు విన్న ప్రజలు వెంటనే ఆ స్థలానికి చేరుకున్నారు. మా బిడ్డలను కాల్చవద్దు అంటూ ఎంత బతిమలాడినా ఆ పోలీసు కుక్కలు కనీసంగానైనా కనికరించకపోగా, గాయపడిన స్థితిలో ప్రాణాలతో పట్టుకున్న మహిళా మిలీషియా కామ్రేడ్స్‌ను ప్రజలంతా చూస్తుండగానే వారిని ఎంతగా చిత్రహింసలకు గురి చేసారంటే మాటలతో వర్ణించడం సాధ్యం కాదు. వారిపై సామూహిక అత్యాచారం చేశారు, చేతి మడిమలను, కాళ్ళ మడిమలను నరికారు. వారి రొమ్ములను బ్లేడ్‌లతో కోసేసారు, చివరికి వారిని దారుణంగా హత్య చేసారు. మా సంపదను తిని హాయిగా బతుకుతున్నారంటూ, ఎవరు మా కోళ్ళు, మేకలు తీసుకున్నారంటూ ఇంగుం (బీజాపూర్ జిల్లా (పశ్చిమ బస్తర్ డివిజన్), భైరంగఢ్ ఏరియా) గ్రామ పటేల్ కొడుకు (వీడు ఎస్‌పీఓలో చేరాడు) పదే పదే బూతులు తిడుతూ చిత్రహింసలు పెట్టాడు, ఆదెవేడ గ్రామంలో పోలీసులకు సరెండరై ఎస్‌పీఓలో పనిచేస్తున్న రాజు, దళంలో పని చేస్తూ, నైతిక తప్పులకు పాల్పడి క్రమశిక్షణా చర్యకు గురైన తర్వాత శతృవు ఎదుట మోకరిల్లి ద్రోహిగా మారిన భామన్‌లు ఈ ఆపరేషన్‌లో ముందున్నారు.

బీజాపూర్ జిల్లా (పశ్చిమ బస్తర్ డివిజన్), భైరంగఢ్ ఏరియాలో ఆదెవేడ ఆర్‌పీసీ పరిధిలోని ఇంగుం గ్రామంలో ఒక పటేల్ ఉండేవాడు. అంటే వీడు గ్రామానికి పెద్దమనిషి. వీడు పెద్ద భూస్వామి. పెద్దమొత్తంలో భూమి, కోళ్ళు, గొడ్లు, పందులు, మేకలు కలిగి ఉండేవాడు. వాడి ఇల్లు కూడా చాలా పెద్దగా ఉండేది. అంధవిశ్వాసాలకు అనుగుణంగా అక్కడి ప్రజలను నడిపించేవాడు. ఆ విధంగా గ్రామం మొత్తాన్ని తమ చెప్పుచేతల్లో పెట్టుకునేవాడు. వాడు ఏమి చెబితే ప్రజలు అదే చేయాలి. వీడి ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజలు సంఘటితమయ్యారు. వాడు దీన్ని సహించలేక స్థానిక సంఘ నాయకత్వ సమాచారాన్ని, మన దళాల సమాచారాన్ని శత్రువుకు చేరవేసేవాడు. మన దళం ఎన్ని హెచ్చరికలు చేసినప్పటికీ వాడిలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో 2018వ సంవత్సరం డిసెంబరు నెలలో మన పార్టీ నాయకత్వంలో ప్రజలు ఐక్యంగా నిలిచి వాడి ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేశారు. వాడి భూములను, సంపదను అక్కడి పేద ప్రజలకు పంచిపెట్టారు. దీంతో గ్రామం నుండి పటేల్‌ను బహిష్కరించారు. వీడి పెద్ద కొడుకు దినేష్ శత్రు ఏజెంట్‌గా పని చేస్తుండడంతో గతంలో మన పీఎల్‌జీఏ ఖతం చేసింది. ఈ చర్య జరిగిన వెంటనే రెండో కొడుకు ఊరు విడిచి శత్రువు దగ్గరకు పారిపోయి ఎస్‌పీఓగా చేరాడు. తాడ్‌బల్ల గ్రామంలో మిలీషియాపై శత్రువు చేసిన దాడిలో పాల్గొన్నది వీడే. వీడు మహిళలను చిత్రహింసలకు గురిచేసి, అత్యాచారం చేసి చంపడంలో ముందున్నాడు.

శత్రువు జరిపిన ఈ పాశవికమైన దాడిలో 10 మంది కామ్రేడ్స్ (ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులు) తమ నులివెచ్చటి రక్తాన్ని ధారపోశారు. అమరులైన వారిలో ఊత్‌లా ఆర్‌పీసీ నుండి ఊత్‌లా గ్రామానికి చెందిన కామ్రేడ్స్ ఓయం సుక్కు (22), బార్సా సుక్కాల్ (20), బార్సా పరమేష్ (20), ఓయం సుద్రీ (20), మాడివీ విజ్జో (20), ఓయం రాజు (21), కుడియం శంకర్ (21); ఛోటాపల్లి ఆర్‌పీసీ నుండి కామ్రేడ్ పార్సా రెయ్యో (15); కోల్‌నార్ ఆర్‌పీసీ నుండి కామ్రేడ్ ఆర్కీ శాంతి (12); తాడ్‌బల్ల ఆర్‌పీసీ నుండి కామ్రేడ్ ఓడి పాలో (21) ఉన్నారు. శత్రు బలగాల చుట్టివేతను అత్యంత ధైర్యసాహసాలతో గండి కొట్టుకుంటూ 60 మంది కామ్రేడ్స్ క్షేమంగా బయటపడ్డారు ఇందులో ఒక మహిళా కామ్రేడ్, ఒక పురుష కామ్రేడ్ గాయపడ్డారు. వీరిద్దరికీ ట్రీట్‌మెంట్ నడుస్తోంది.

క్రాంతికారీ జనతన సర్కార్లను కాపాడే క్రమంలో తమ నులివెచ్చని రక్తాన్ని చిందించిన అమరుల శవాల కోసం వెంటనే వందలాది మంది ప్రజలు పోలీసుల వెంటపడ్డారు. కానీ పోలీసులు శవాల కోసం వెళ్ళిన మహిళలను తుపాకీ బట్‌లతో కొట్టారు, ఫైరింగ్ చేస్తామంటూ భయపెట్టారు, కానీ శవాలను మాత్రం ఇవ్వలేదు. దీంతో మూడువేల మంది ప్రజలు సమీకరించబడి, తమ బిడ్డల భౌతిక కాయాల కోసం భైరంగఢ్ పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు. అక్కడ కూడా పోలీస్ అధికారులు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించారు. దాంతో బీజాపూర్–గీదం రోడ్డుపై ప్రజలు రాస్తారోకో చేశారు. రాస్తారోకో చేస్తున్న ప్రజలను పోలీసులు వాహనాలలో

బీజాపూర్‌కు తీసుకెళ్ళారు. అయినప్పటికీ ప్రజలు దృఢంగా నిలబడి అమరుల భౌతిక కాయాలను పోలీసుల నుంచి స్వాధీనం చేసుకొని తమ ప్రాంతానికి తీసుకుని వచ్చి, విప్లవ సాంప్రదాయాలతో అమరుల భౌతిక కాయాలకు అంత్యక్రియలు జరిపారు. మీ రక్తం ఎప్పటికీ వృధా కాదు, మీ నెత్తుటి అప్పును తీర్చుకుంటాం, మీ ఆశయాలను కొనసాగిస్తాం, ఆర్‌పీసీలను కాపాడుకుంటాం, నవ సమాజ నిర్మాణం కోసం ముందుకు కొనసాగుతాం అంటూ నినదిస్తూ ప్రజలు, మిలీషియా అమరులకు అంతిమ వీడ్కోలు పలికారు.

**తాడ్‌బల్ల అమరులకు దండకారణ్య ప్రజల శత కోటి విప్లవ జోహార్లు!**

**అమరుల ఆశయాలను తుదివరకూ కొనసాగిద్దాం!**